వైన్‌షాపు వదిలేస్తే..రూ.కోటి

- వ్యక్తిగతంగా షాపులు దక్కించుకున్న వారికి సిండికేట్ల బంపర్ ఆఫర్లు...
- గుడ్‌విల్ కింద అదనపు చెల్లింపు
- షాపుల కోసం రంగంలోకి దిగిన నేతలు
- డైలమాలో లాటరీ తగిలినవారు





జగ్గయ్యపేట/నందిగామటౌన్/కంచికచర్ల/పెనుగంచిప్రోలు: వ్యక్తిగతంగా మద్యం షాపులను దక్కించుకున్నవారికి సిండికేట్లు బంపర్ ఆఫర్లు ఇస్తున్నాయి. సిండికేట్ల నిర్వాహకులు గుడ్‌విల్, లాభాల్లో వాటా, ప్రతినెలా చెల్లింపులు అంటూ వ్యక్తిగతంగా మద్యంషాపులను దక్కించుకున్నవారి నుంచి షాపును చేజిక్కించుకునేందుకు పలు రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. రూ.2లక్షల దరఖాస్తు ఫీజుతో లాటరీ ద్వారా షాపును దక్కించుకున్న వారిలో కొందరు ఈ సిండికేట్ల ఆఫర్లపై నిర్ణయం తీసుకునేందుకు తర్జనభర్జనపడుతుండగా, మరికొందరు ఆయా ఆఫర్లను వినియోగించుకుంటూ మద్యం షాపులను అనధికారికంగా సిండికేట్లకు అప్పగిస్తున్నారు.

ఆర్థిక స్థోమత లేనివారిపై గురి...

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని ఆయా పట్టణాలు, మండల గ్రామాల్లో మొత్తం 33 మద్యం షాపులు ఉన్నాయి. ఆయా మద్యంషాపులకు కొంతమంది వ్యక్తులు సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తు చేయగా, మరి కొందరు ఔత్సాహికులు వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ విధానంలో ఆయా షాపుల నిర్వాహకులను ప్రభుత్వం ప్రకటించింది. అయితే వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకున్న పలువురికి కూడా లాటరీ ద్వారా మద్యంషాపులు దక్కాయి. అయితే వీరిలో కొందరికి మద్యంషాపు ఏర్పాటుతోపాటు లైసెన్స్ ఫీజు చెల్లింపునకు తగిన ఆర్థికస్థోమత లేదని గ్రహించిన సిండికేట్ల నిర్వాహకులు అటువంటివారిని టార్గెట్ చేస్తూ ఆఫర్లు పేరుతో జోరుగా బేరసారాలు సాగిస్తున్నారు.

చక్రం తిప్పుతున్న నేతలు..

జగ్గయ్యపేట పట్టణంలోని ఓ మద్యం షాపు తెలంగాణకు చెందిన ఓ మహిళకు దక్కింది. అయితే గుడ్‌విల్ చెల్లింపు ద్వారా ఈ షాపును జగ్గయ్యపేట ప్రజాప్రతినిధి బంధువులు చేజిక్కించుకున్నట్లు సమాచారం. అదేవిధంగా పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం ఐదు మద్యం షాపులు ఉండగా నాలుగు షాపులు సిండికేట్లకే దక్కాయి. మిగిలిన ఒక్క షాపు విజయవాడకు చెందిన వ్యక్తికి దక్కగా, నియోజకవర్గానికే చెందిన ఓ మాజీప్రజాప్రతినిధి రూ.90లక్షలు చెల్లించేందుకు సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. వత్సవాయిలోని ఓ మద్యంషాపును ముండ్లపాడుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు రూ.కోటి చెల్లిస్తానంటూ చర్చలు జరుపుతున్నారు. జగ్గయ్యపేటలోని ఓ మద్యంషాపు వ్యాపారవర్గానికే చెందిన వ్యక్తికి దక్కగా, అతనితో రెండు సిండికేట్లు చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే సిండికేట్‌గా మారి అధిక సంఖ్యలో దరఖాస్తులు వేసి మద్యంషాపులను దక్కించుకున్నవారితోపాటు గతంలో సిండికేట్లు నడిపిన వ్యక్తులు కూడా సదరు షాపు లైసెన్స్ దారుతో విజయవాడ కేంద్రంగా జోరుగా మంతనాలు సాగిస్తుండటం గమనార్హం.

కంచికచర్లలో ఆ నలుగురిదే హవా..

కంచికచర్ల ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో కంచికచర్ల మండలంలో ఐదు, వీరులపాడు మండలంలో రెండు మద్యం షాపులు ఉన్నాయి. ఇక్కడ కూడా పాతసిండికేట్ నిర్వాహకులు, అధికార పార్టీ మద్దతుదారులే అధికమొత్తంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇక్కడ మద్యంషాపులు ఎవరికి దక్కినా సిండికేట్‌కు చెందిన ఆ నలుగురు వ్యక్తులే చక్రం తిప్పుతున్నారు. చెవిటికల్లు, కంచికచర్ల, చందర్లపాడు మండలం ముప్పాళ్ల, వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన ఓ నలుగురు వ్యక్తులు ఇక్కడ సిండికేట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

పాత సిండికేట్లకు దక్కని షాపులు..

నందిగామ పట్టణం, మండల పరిధిలోని మద్యంషాపులకు 2019కు ముందు మద్యం సిండికేట్‌ను నడిపినవారంతా కలిసి భారీ సంఖ్యలో దరఖాస్తులు వేయగా, లాటరీలో వారికి ఒక్క షాపు కూడా దక్కలేదు. ఇక్కడ షాపులు దక్కించుకున్నవారంతా ఇతర ప్రాంతాలకు చెందిన అధికార టీడీపీ కూటమి మద్దతుదారులుగా ప్రచారంలో ఉంది. షాపులు దక్కించుకున్నవారంతా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు కోసం తగిన భవనాలను వెతుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు గతంలో మద్యం సిండికేట్‌ను నిర్వహించినవారు ఇప్పటికే మద్యం షాపు లైసెన్స్ దక్కించుకున్నవారితో మంతనాలు సాగిస్తున్నారు. పాత సిండికేట్‌కు అసలు షాపులే దక్కకపోవడంతో కొత్తవారితో చర్చలు వారికి సజావుగా సాగడం లేదని సమాచారం. షాపుల ఏర్పాటు, అవి ఉన్న ప్రాంతాలు, అక్కడ ఉండే గిరాకీ ఆధారంగా కొద్దిరోజులు వేచి చూద్దామనే ఆలోచనలో పాతసిండికేట్ నిర్వాహకులు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇలా లాటరీ ద్వారా మద్యంషాపులను దక్కించుకున్న కొత్త వారికి సిండికేట్ల నిర్వాహకులు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తూ ఇప్పటికే కొన్ని షాపులను దక్కించుకోగా, మిగిలిన షాపుల కోసం సాగిస్తున్న మంతనాలు కూడా కొద్దిరోజుల్లో ఓ కొలిక్కిరానున్నాయనే చర్చ మద్యం వ్యాపార వర్గాల్లో జోరుగా సాగుతోంది.

క్లుప్తంగా

బాధితులకు దుప్పట్లు పంపిణీ



జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం, రావిరాల గ్రామాల్లోని వరద బాధితులకు రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ మాట్లాడుతూ గతనెలలో భారీ వర్షాలు, వరదల కారణంగా పలు ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. దీంతో బాధితులను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం ఫరూక్ మహ్మద్, వైద్యుడు రాజాకేశవప్రసాద్, డీజీఎం రామకృష్ణసాయి, వెంకటశివాజీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి అరకుకు సైకిల్ యాత్ర



పెనుగంచిప్రోలు: ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత రతన్‌టాటాకు నివాళిలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ట్రావెలర్ పొన్నాన బాలరాజు హైదరాబాద్ నుంచి అరకు వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. సైకిల్‌యాత్రలో భాగంగా ఆయన మంగళవారం ఖమ్మం మీదుగా పెనుగంచిప్రోలు చేరుకున్నాడు. బాలరాజు మాట్లాడుతూ ఐదు రోజుల కిందట ఈ యాత్ర చేపట్టానని, మరో వారం రోజుల్లో అరకు చేరుకుంటానన్నారు. తాను పలు ప్రాంతాలకు ట్రావెలింగ్ చేస్తుంటానని, దేశానికి రతన్‌టాటా అందించిన సేవలను స్మరిస్తూ ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన




ముక్త్యాల(జగ్గయ్యపేట): పత్తి పంటలో సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ భవాని సూచించారు. ముక్త్యాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు అత్యాధునిక వ్యవసాయంతోపాటు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విత్తన ఎంపిక నుంచి దిగుబడి వచ్చే వరకు అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవాలని సూచించారు. ఏవో వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అభ్యాసన అంగవైకల్యంపై అవగాహన ర్యాలీ



నందిగామటౌన్: విద్యార్థుల్లో నిర్దిష్ట అభ్యాస అంగవైకల్యంపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో పద్మావతి సూచించారు. అభ్యాస అంగవైకల్య మాసోత్సవాలలో భాగంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి నందిగామలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యాస అంగవైకల్యమున్న చిన్నారులు తెలివితేటలు తక్కువగా ఉండటం, సోమరితనం, చదివిన చదువు గుర్తుండకపోవటం వంటి సమస్యలు ఎదుర్కొంటారన్నారు. ఇటువంటి విద్యార్థుల విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా విద్యార్థులు ఆ సమస్యను అధిగమించేలా చూడవచ్చని పేర్కొన్నారు. పిల్లల్లో పురోభివృద్ధే లక్ష్యంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు మేరి గ్రేస్, నాగమల్లేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..



జగ్గయ్యపేట అర్బన్: నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై జగ్గయ్యపేట పట్టణంలోని భవిత కేంద్రం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామపురం మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివరామ్‌నాయక్, సహిత విద్య ఉపాధ్యాయులు డి.జానకి, డి.ఉదయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడే అసలు దొంగ

చోరీకేసును తేల్చిన పోలీసులు



జగ్గయ్యపేటఅర్బన్: షుగర్ బస్తాల లోడు లారీ చోరీకేసును చిల్లకల్లు పోలీసులు ఛేదించారు. జగ్గయ్యపేట సీఐ జానకీరామ్ కథనం మేరకు..జగ్గయ్యపేట పట్టణంలోని తొర్రగుంటపాలెంకు చెందిన యాకూబ్‌బాషా లారీలు నడుపుతుంటాడు. ఈనెల 9వతేదీన యాకూబ్‌బాషాకు చెందిన లారీ కర్నాటకలోని శివశక్తి షుగర్ ఫ్యాక్టరీలో 630 షుగర్ బస్తాలను లోడ్ చేయించుకొని ఒరిస్సా రాష్ట్రంలోని కుర్దాకు వెళ్తోంది. ఈక్రమంలో మార్గమధ్యంలో జగ్గయ్యపేట ఆటోనగర్‌లో లారీ మరమ్మతులకు గురైంది. మరమ్మతుల అనంతరం లారీ డ్రైవర్ తిరిగి ఒరిస్సాకు బయలుదేరాడు. మార్గంమధ్యంలో ఈనెల 12వతేదీ రాత్రి లారీని చిల్లకల్లు గ్రామం బయట ఉన్న కింగ్ డాబా ఎదుట ఉన్న పార్కింగ్ చేశాడు. తిరిగి 13వతేదీ వెళ్లి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో లారీయజమాని యాకూబ్‌బాషా షుగర్‌లోడ్‌తోఉన్న తనలారీ అపహరణకు గురైందని చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు 630బస్తాలతో ఉన్న లారీని స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదుదారుడైన యాకుబ్‌బాషానే అసలు నిందితుడని గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న లారీ యజమాని యాకుబ్‌బాషానే షుగర్‌లోడును కాజేయాలనే ఉద్దేశంతోనే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కేసును త్వరితగతిన పరిష్కరించిన సీఐ జానకీరామ్‌ను, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శనీయం



అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి చిన్నా, నాయకులు



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతిని మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోదాడ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహానికి తన్నీరు నాగేశ్వరరావు, ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ క్షిపణి శాస్త్రవేత్తగా దేశానికి చేసిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. అబ్దుల్‌కలాంకు నివాళులర్పించినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి లాహోరి బద్దూనాయక్, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్, విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ సభ్యుడు నంబూరి రవి, రాష్ట్ర ముదిరాజ్ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ చాపల వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి, నాయకులు వేముల విజయ్, డి.వెంకటేశ్వరరావు, మెట్టు ఏడుకొండలు, ముచ్చింతాల శ్రీను, ఆర్.ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఎమ్మెల్యే నివాళి..

దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి మాజీరాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కొనియాడారు. స్థానిక కోదాడ రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, పలువురు నేతలతో కలిసి మంగళవారం ఆయన నివాళులర్పించారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: కలాం జయంతిని పురస్కరించుకుని కేవీఆర్ జెడ్పీ, ముండ్లపాడు జెడ్పీ హైస్కూళ్లలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హెచ్‌ఎం కె. జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా సామూహికంగా నట్టల నివారణ మందులు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ఎం.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నట్టల నివారణ మందును జీవాలకు తాగించడం ద్వారా జీవాల బరువు పెరుగుతుందని, జీవాల మరణాలు తగ్గుతాయని వివరించారు. జీవాల పోషకులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేడీ కోరారు.

విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి

వీరులపాడు: అభ్యాస వైకల్యం విద్యార్థుల విషయంలో ఉపాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో పాల్ కెనడీ సూచించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మంగళవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఐఆర్పీలు సుబ్బారావు, బేబీ రత్నకుమారి,పాల్గొన్నారు.

కంచికచర్లలో..

పిల్లల్లో నిర్దిష్ట అభ్యాసన వైకల్యం వ్యాధి కాదని ఇది ఒక పరిణామక్రమమని కంచికచర్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలల మంగళవారం అభ్యాసన వైకల్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అహ్మద్, కనకారావు పాల్గొన్నారు.

వచ్చామా..వెళ్లామా..మమ అనిపించామా!

- కాండ్రపాడు భూకబ్జా వ్యవహారంపై అధికారుల తీరు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోని వైనం



కాండ్రపాడు ప్రభుత్వ లేఅవుట్ వద్ద ఫోన్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ పాల్

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం కాండ్రపాడు గ్రామంలోని ప్రభుత్వ లేఅవుట్‌ను కాజేసేందుకు యత్నించిన కూటమి నాయకులు దూలం కోటమ్మ, దూలం గోపిరెడ్డి, దండా అవినాష్‌రెడ్డి, గోటిక శివకృష్ణారెడ్డిలపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ, పోలీస్ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ లేఅవుట్ కబ్జా చేసేందుకు పైనలుగురు వ్యక్తులు యత్నిస్తున్న వైనంపై 'సాక్షి' దినపత్రిక మంగళవారం 'మొద్దునిద్రలో అధికారులు' శీర్షికన ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి చందర్లపాడు తహసీల్దార్ పాల్ స్పందించి కాండ్రపాడులోని ప్రభుత్వ లేవుట్‌ను సందర్శించారు. కూటమి నాయకులు ధ్వంసం చేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. అయితే ఈ కబ్జాకు యత్నిస్తున్న సదరు వ్యక్తులను నేరుగా పిలిపించకుండా ఫోన్‌ద్వారా వారిని సంప్రదించిన తహసీల్దార్, ఈ లేఅవుట్ ధ్వంసం విషయం గురించి వారిని ప్రశ్నించకుండా ఇతరత్రా విషయాలను మాట్లాడి మమ అనిపించారు. సమస్య పరిష్కారమైందని స్థానికులకు తెలిపి అక్కడ్నుంచి వెనుదిరిగారు. దీంతో వచ్చామా.. వెళ్లామా అన్న చందంగా తహసీల్దార్ వ్యవహరించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాజేసేందుకు యత్నించడమే కాకుండా తాగునీటి ట్యాంకు, పైప్‌లైన్‌లు, రోడ్లు ధ్వంసం చేసిన వారిపై కనీస చర్యలు కూడా తీసుకోరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తి అని కోర్టు ధ్రువీకరించినా..

గతంలో అప్పటి ప్రభుత్వం భూసేకరణ జరిపి అందుకు సంబంధించిన నగదును రైతుకు చెల్లించినట్లుగా రికార్డుల్లో ఉండటంతో భూయజమానులు వేసిన దావాను కొట్టేస్తూ అస్థలం ప్రభుత్వానికే చెందుతుందంటూ ఇప్పటికే న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అయితే ఆ భూమి తమదని చెబుతూ ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న కూటమి నాయకులపై రెవెన్యూ అధికారులు మాత్రం చర్యలకు వెనుకాడుతున్నారు. అధికారుల తీరు అక్రమార్కులకు అండగా మారుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. లేఅవుట్ ధ్వంసం చేస్తుంటే అడ్డుకున్న మహిళపై దాడి చేసి చంపుతామని బెదిరించిన వైనంపై పోలీసులకు ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఫలితం మాత్రం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించని పక్షంలో ఈ విషయంపై న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని గ్రామస్తులు చెబుతున్నారు.

అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, పక్కన ఎంపీపీ హనుమంతరావు

నందిగామ టౌన్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, విద్యుత్ సరఫరా, వీధిలైట్ల సమస్యల పరిష్కారానికి అధికారులు కనీసం స్పందించడం లేదని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆకుల హనుమంతరావు అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

బాధితులకు అందని పరిహారం...

ఇటీవల సంభవించిన వరదల కారణంగా తమ గ్రామంలో పంట నష్టపోయిన 22మంది రైతులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం అందలేదని మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి సమస్యను సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్నప్పటికీ బాధితులకు పరిహారం అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచల ఎంపీటీసీ సభ్యుడు రామిరెడ్డి సీతయ్య మాట్లాడుతూ వరదల కారణంగా తమ గ్రామ పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి...

గ్రామాలలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండకపోతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వీధిలైట్లు వెలగక గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. తాగునీటికి కూడా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులు మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేల దృష్టికి రోడ్డు సమస్య...

రహదారి ఇటీవల వచ్చిన వర్షాలు, వరదల కారణంగా మండలంలోని దాములూరు కూడలి రెండు కిలోమీటర్ల మేర పూర్తిగా ధ్వంసమైందని సభ్యులు గుర్తుచేశారు. రహదారికి పడిన గండ్లను పూడ్చి మరమ్మతులు చేయించాలని నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ దృష్టికి తీసుకెళ్లిన వినతులు కూడా కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సురేష్‌బాబు మాట్లాడుతూ కంచల గ్రామంలోని మునేటి సమీపంలో ఇసుక పాయింట్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై కూరగాయలు

నందిగామ టౌన్: రైతుబజార్ ద్వారా రాయితీపై నాణ్యమైన కూరగాయలను అందిస్తున్నట్లు రైతు బజార్ ఎస్టేట్ అధికారి రవికుమార్ తెలిపారు. రిటైల్ మార్కెట్‌లో కంటే రైతుబజారులో రూ.20 తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు వివరించారు. రాయితీపై టమాటా కేజీ రూ. 45, ఉల్లిపాయలు కేజీ రూ. 33, పామాయిల్ కేజీ రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 124లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి : ఎమ్మెల్యే



అల్లూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

వీరులపాడు: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అల్లూరు, జుజ్జూరు గ్రామాల్లో రూ.1.10కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో అరుంధతీదేవి, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఏపీవో జనార్దన్, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, సర్పంచ్ రమావత్ కోటి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ తదితరులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లులో రూ.70లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ శ్రీనివాసరావు, కార్యదర్శి శివాజీ, తాళ్లూరి పార్వతి, నరసింహారావు, విశ్వనాథం, అధికారులు పాల్గొన్నారు.

పడవ రాకపోకలు నిలిపివేత



సాక్షి స్పందన

ముక్త్యాల(జగ్గయ్యపేట): కృష్ణానదిపై పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి జగ్గయ్యపేట మండలం ముక్త్యాలకు ప్రమాదభరితంగా సాగిస్తున్న పడవ రాకపోకలను రెవెన్యూ, పోలీస్ అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులకు లైఫ్‌జాకెట్లు, ఎటువంటి భద్రతా చర్యలు పాటించకుండా పడవ ప్రయాణాలు సాగిస్తున్న వైనంపై 'ప్రమాదపుటంచున పడవ ప్రయాణం' శీర్షికన 'సాక్షి' దినపత్రిక మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన జగ్గయ్యపేట తహసీల్దార్ నాగరాజు పడవ రాకపోకలను నిలిపివేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా పడవ రాకపోకలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. తగిన అనుమతులు లేకుండా మాదిపాడు – ముక్త్యాలకు పడవను నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Patamata Branch, VJA వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మం., లింగాలపాడు కాపురస్తులు జమ్ముల వెంకటేశ్వరరావు గారి భార్య జమ్ముల పద్మావతి గారు సెటిల్‌మెంట్ దస్తావేజు నం.5910/2017 (యస్.ఆర్.ఓ., నందిగామ) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మార్టిగేజ్ చేసుకొని జమ్ముల పద్మావతి గారి పేరు మీద లోన్ పొందనున్నారు. సదరు జమ్ముల పద్మావతి గారికి లోను ఇచ్చుటకు ఏవరికైనను ఎటువంటి కోర్టు ఎటాచ్‌మెంట్లు గాని, క్లయిములు గాని మరియు ఏ ఇతర అభ్యంతరములు వున్న యెడల వారి అభ్యంతరములను ఈ క్రింది అడ్రస్సుకు 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. ఆపై వచ్చు క్లయిములు గాని, అభ్యంతరములు గాని, నా క్లయింటును బైండ్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్- [illegible]: యన్.టి.ఆర్. జిల్లా, నందిగామ సబ్-రిజిస్ట్రారు వారి ఋజులాకా నందిగామ మం., లింగాలపాడు గ్రామ పంచాయతి ఏరియాలోని లింగాలపాడు గ్రామ ఆర్.యస్.నెం. 8/7ఏ, 1వ బిట్టు దాఖలా య. 0.30 సెంట్లు భూమికి హద్దులు: తూర్పు: ఎర్రం వీరయ్య వగైరాల భూమి; దక్షిణం: ఉమ్మినేని చిన్న వెంకట నరసయ్య వగైరాలు, ఆర్ & బి రోడ్డు; పడమర: ఎర్రం వీరయ్య మరియు కౌసల్యమ్మ వగైరాలు; ఉత్తరం: ఆర్&బి రోడ్డు, బెక్కు ద్వాప్ కాలువ.

ఇట్లు
T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. ✆ 9849431432

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com